## 1986 అక్షయ దీపావళి కథల పోటీలో రు. 500 బహుమతి పొందిన ఉత్తమ కథ

శ్రీ జగన్నాథ స్వామి రథోత్సవం రంగ రంగ వైభోగంగా జరుగుతోంది. ఊరి ప్రజల ఆనందం, ఉత్సాహము పట్టపగ్గాలు లేవు. దైవ నామస్మరణతో దిక్కులు అదిరిపోతున్నాయ్.

బరువైన రథానికి రెండు ప్రక్కల బలమైన తాళ్ళు కట్టి ఒక్కొక్క ప్రక్క సుమారు ఏభై మంది తమ శారీరక బలాన్నంతా ఉపయోగించి లాగుతుంటే ముందర పర్వతం లాగున్న రథం ఒక్కొక్క సెంటీమీటరే భారంగా కదులుతోంది.

# మానసికశక్తి
## ఆ భావి మాలిదే

రథం ఊరి మధ్యనున్న ఎత్తయిన ప్రదేశానికి వచ్చి ఆగింది. అక్కడ నుండి ఒక్క సెంటీమీటరు రథాన్ని కదిపితే ఏటవాలుగా వున్న ప్రదేశంపై దొర్లుకుంటూ పల్లానికి పోతుంది.

ఊరి పెద్దలంతా రథం చుట్టూ ఉండి యువకులు అందర్నీ మరోసారి హుషారు చేశారు.

ఎప్పటిలాగే రథం వెనుక బలమైన తాళ్ళనుకట్టి ఒక్కొక్క ప్రక్క సుమారు ఏభైమంది పట్టుకుని రథం వేగంతో పల్లం లోనికి పోకుండా నెమ్మదిగా సాగిపోయేట్లు చూడటానికి-

"రథం ఈ స్థానం నుండి డౌన్‌లోకి వెళ్ళడం ప్రారంభించగానే ముందున్న వందమందీ వెనక్కు వచ్చేసి ఈ ఏభై మందితోనూ చేరిపోవాలి. అర్థమైందా" గ్రామ పెద్ద మైకులో అరిచారు.

"అర్థమైంది" ఉత్సాహంతో కేకలు వేశారు కండలు తిరిగిన మగరాయుళ్ళు.

"జనం రథానికి దూరంగా జరగండీ" గ్రామ పెద్ద మైకులో మరోసారి కేక వేశాడు.

కొందరు వాలంటీర్లు కర్రలతో జన ప్రవాహానికి అడ్డు కట్టవేస్తూ రథానికి దూరంగా జరిపారు. మరోసారి జగన్నాథ స్వామి నామం ఆకాశం బ్రద్దలయ్యేలా వినిపించింది.

రథం ఒక్క సెంటీమీటరు ముందుకు జరగాల్సింది ఒక్క అరసెంటీమీటరు మాత్రం జరిగి ఆగిపోయింది. అందుకు కారణం రథం ముందు కట్టిన రెండు తాళ్ళూ ఫట్‌మని తెగిపోవడం. రెండు ప్రక్కలనున్న వందమందీ బ్యాలెన్స్ తప్పి క్రింద పడిపోయారు. ఈ హఠాత్సంఘటన నుండి తేరుకునే లోగానే రథం వెనక్కు కదలసాగింది.

అంటే అటు ప్రక్క కూడా పల్లమే.

అంతే! మహామృత్యువులా కిర్రు శబ్దం చేస్తూ జగన్నాథ రథం కదలుతుంటే జనం ప్రాణభీతితో చెల్లాచెదురై దూరంగా జరిగిపోయారు.

ఎవరూ హెచ్చరించకుండగనే కదిలే రథం ముందు ఖాళీ అయిపోయింది అంతా.

అటు ప్రక్కనున్న వందమందీ పట్టుకున్న తాడుతో వెనక్కు వచ్చి బలంగా లాగితే రథం ఆగి వుండేదే. ఆ క్షణంలో, ఆ ప్రాణభీతిలో అలాంటి ఆలోచన ఎవరకూ రాలేదు.

వాళ్ళూ తాడు వదిలేశారు.

ఇంకేం, రథానికి కళ్ళెంలేక కదలిపోతున్న కొండలాగా క్రిందకు జారిపోతోంది.

జనకోటి భయం భయంగా కేకలు వేశారు.

ఎన్నో సంవత్సరాలుగా జరుగుతున్నా ఎన్నడూ ఇలా జరుగలేదు. ఊహించని హఠాత్సంఘటనకు అందరూ నిశ్చేష్టులై రథం వైపు చూడసాగేరు. అంతకన్న భయంకరమైన దృశ్యం కనుపించింది. మరుక్షణంలో-


ఆ పల్లంలో ఐదేళ్ళ పిల్లవాడొకడు తప్పటడుగులు వేసుకుంటూ రథానికి. ఎదురుగా వస్తున్నాడు. "బాబోయ్! ఎవరి పిల్లవాడో తప్పిపోయి రథానికి ఎదురు వస్తున్నాడు. చచ్చిపోతాడు. రక్షించండి" అని కేకలు వేయసాగేరు జనం పిచ్చిగా.

అంతవరకూ జనంలో తప్పిపోయిన తన పిల్లవాణ్ణి వెతుక్కుంటున్న శ్రీలక్ష్మి చెవుల్లో ఆ కేకలు పడ్డయ్.

"శ్రీనూ!" అని గావుకేక పెట్టింది భూనభోంతరాళాలు దద్దరిల్లేటట్లు.

తన పంచ ప్రాణాల కన్న మిన్నయైన ఆ బిడ్డ మృత్యువుకు ఎరకాబోతున్న విషయం ఆ కన్నతల్లి ఎదలో ఆ క్షణంలో ఎంతటి ఆవేదన రగిల్చిందో వర్ణనాతీతం.


### రచయిత గురించి...



ఎ.బి.వి.ఎం. లింగదేవర, స్వగ్రామము: పిఠాపురం (తూ.గో. జిల్లా), విద్యాభ్యాసము: తుని, పిఠాపురము, రైల్వేలో డ్రైవర్ ఉద్యోగము. వయసు : 33 సం. మంచి పుస్తకములు చదవడము, పిల్గ్రిమేజ్, అత్యంత ప్రీతికరములు.

కథలు, నవలలు, నాటికలు వ్రాయడంలో సుమారు పది సంవత్సరముల నుండి కృషి (ఒక విధంగా తపస్సు). కాని ఇంతవరకూ ఏ ఒక్కటీ ప్రచురణ కాలేదు. ఆంధ్రజ్యోతివారు నా కృషి (తపస్సు) ఈనాటికి ఫలింపచేసి (వరం ప్రసాదించి) నారు. మనిషియొక్క మనస్తత్వము (సైకాలజీ), మనుష్యుల విభిన్న జీవిత శైలులపై రచనలు చేయాలనే ఉత్సాహం ఎంతైనా వుంది. కాని ప్రోత్సాహం మాత్రమే కావలసింది. అందుకు పత్రికా సంపాదకుల, పాఠకుల సహాయం ఎంతైనా అవసరం.

—రచయిత




"నా శ్రీనును రక్షించండి" అంటూ జనం మధ్యలో నుండి రథం వెళ్తున్న వైపుకు వెళ్ళడానికి ప్రయత్నించింది కాని జనం ఆమెకు త్రోవ ఇవ్వలేదు.

తన కన్న కొడుకుని రక్షించుకోలేని నిస్సహాయత ఆమె గుండెలు వ్రయ్యలుచేస్తోంది.

తన బిడ్డను ఎవరూ రక్షించలేరని తెలుసుకుంది. ఆమె మనస్సులో అగ్ని పర్వతాలు బ్రద్దలైనాయ్. సప్త సముద్రాలు ఏకమై భీభత్సాన్ని సృష్టించాయ్. మిన్ను విరిగి మీద పడుతున్నట్లు, కాలి క్రింద భూమి బ్రద్దలౌతున్నట్లు అనిపించింది ఆమెకు. ఈ జనం మీద నుండి ఎగిరి పోయి అవతలకు వెళ్ళి తన ముద్దు బిడ్డను తనే రక్షించుకోవాలి అని సంకల్పించుకుంది. ఆమె కాళ్ళలో అనంతమైన శక్తి కూడుకుంది. ఆమె శరీరం దూదికన్న తేలికైపోయింది. కాళ్ళను భూమికి తన్నిపెట్టి పక్షిలా ఎగిరిపోవడానికి ప్రయత్నించింది. మహాశ్చర్యం.

కన్నుమూసి తెరిచేలోగా మనో వేగంతో ఆమే జనంమీదుగా ఎగిరివెళ్ళి అవతలకు చేరుకుంది. జన సందోహం గుడ్లప్పగించి నిశ్చేష్టులై చూస్తున్నారు రెప్పవేయకుండా.

కొండలా కదిలి వస్తున్న రథాన్ని చూస్తూ నవ్వుతూ, చేతులు ముందుకు చాపుతూ, తప్పటడుగులు వేస్తూ ముందుకు వచ్చిన శ్రీను ఆ రథ చక్రం క్రింద నలిగిపోవడానికి ఓ క్షణకాలం కూడా వ్యవధి లేదు.

రథం ముందుకు వెళ్ళి తన బిడ్డను పొత్తిళ్ళలో ఎత్తుకునే వ్యవధి కూడా లేదని అరక్షణంలోనే గ్రహించింది శ్రీలక్ష్మి.

రథం ప్రక్కనే వ్రేలాడుతూ తనకు అందు బాటులో వున్న తాళ్ళు ఆమె దృష్టిపథంలో పడ్డాయి. రెండు తాళ్ళను పట్టుకుని రథాన్ని దొర్లనీయకుండా ఆపివేయాలని సంకల్పించుకుంది శ్రీలక్ష్మి. అత్యాశ్చర్యకర విషయం!

'శ్రీనూ!' అని బ్రహ్మాండ వలయమంతా ప్రతిధ్వనించేలా అరుస్తూ ఆ రెండు తాళ్ళనూ రెండు చేతులతోనూ బలంగా పట్టుకుంది.

ఆమె ఊపిరి బిగపట్టింది. తన నవనాడులలోనూ, ప్రతి అణువులోనూ, మనసులోని అంతరంతరాల్లో నిక్షిప్తమై వున్న అనంతమైన మానసిక శక్తి ఆమె చేతుల్లో నికి వచ్చింది.

అంతే! కదలుతున్న రథం కొన్ని క్షణాలులగిపోయింది.

"శ్రీనూ!" అణువు అణువూ చెమటలు కక్కుతూ మాతృ ప్రేమలోని మాధుర్యాన్ని అంతటినీ నింపుకుని పిలిచింది.


తల్లి పిలుపు విన్నాడు బిడ్డడు.

ఏ తల్లి పిలుపునకు సకలచరాచర జగత్తూ అణిగి మణిగి శాసించబడుతుందో, ఏ తల్లి పిలుపులో సప్త స్వరాలకన్నా అతీతమైన ప్రేమస్వరం నిండివున్నదో, ఏ తల్లి పిలుపు ఈ అనంతకోటి గ్రహరాసుల సమ్మేళనమైన విశ్వాంతరాళం యొక్క సృష్టి, స్థితి, లయ లకు కారణమైన చైతన్యము అవుతున్నదో- అలాంటి తల్లి పిలుపు మనసు లోతుల్లో ప్రేమ, వాత్సల్యములను నింపుకుని వాక్కు రూపంలో ఆమె నోటి నుండి వచ్చింది.

శ్రీను రథ చక్రం దగ్గర నుండి తల్లి పిలుపు విని ప్రక్కకు తొంగి రథం క్రింద నుండి చూశాడు.

అంతవరకూ ఏ తల్లికోసం ఆ పసివాడు తపిస్తున్నాడో, ఆ తల్లి దృష్టిపథంలో పడగానే- బ్రహ్మాండాధిపత్యం పొందినంత సంతోషించాడు.

"అమ్మా" అని పిలిచాడు.




జరగబోయే ఘోరాన్ని చూడలేకనో, తన అంతరాంతరాల్లో నిక్షిప్తమై వున్న బ్రహ్మాండమైన శక్తిని చేతుల్లో కేంద్రీకరింప చేసుకోవడానికో కళ్ళు మూసుకున్న శ్రీలక్ష్మి- తన బిడ్డ 'అమ్మా' ని తనను పిలువగానే పారవశ్యంతో కళ్ళు విప్పింది.

"బాబూ!" కోటానుకోట్ల వీణా తంత్రులు అతి మృదుమధురంగా పలికినట్లున్న ఆ పిలుపు విని శ్రీను రథం క్రింద నుండి తల్లి వద్దకు పరుగెత్తాడు.

అంతే!

మరుక్షణం పట్టు సడలిపోయింది.

చేతుల్లో తాళ్ళు వదలివేసింది.

రథం కిర్రుకిర్రుమంటూ అతనికి ఏ విధమైన హాని కలుగని రీతిలో పై నుండి దొర్లుకుంటూ పల్లంలోకి సాగిపోయింది.

చేతుల్లోకి వచ్చిన శ్రీనును బలంగా గుండెలకు హత్తుకుంది ఆ తల్లి.

జీవాత్మ, పరమాత్మల అనుసంధానంతో తాత్త్వికులు పొందే బ్రహ్మానందాన్ని మించిన ఆనంద పారవశ్యంతో ఆ అమృతమూర్తి తన బిడ్డని ముద్దులతో ముంచెత్తింది.

సాగిపోతున్న రథం సరిగా ఎదురుగా వున్న కోనేరులో పడిపోయింది బాంబు పేలినంత శబ్దంచేస్తూ.

జనకోటి ఆశ్చర్యానికి అవధులు లేకుండా పోయింది. వందమంది పురుషులు అతి కష్టంతో లాగే రథాన్ని ఒకే ఒక్క ఆడది రెండు చేతులతో నిలిపి వేయడమా!

ఇది కలా! నిజమా! మాయా! ఇంద్రజాలమా! మహేంద్రజాలమా!

జనంలో అందరికంటె ముందుగా తేరుకున్న ఆమె భర్త శ్రీనివాసు 'శ్రీలక్ష్మీ'యని పిలుస్తూ ఆమె దగ్గరగా వచ్చాడు.


ఈమె నిజంగా నా భార్య శ్రీలక్ష్మియేనా లేక మహాశక్తి స్వరూపిణియా అనే అనుమానం అతని కళ్ళల్లో స్పష్టంగా కనిపిస్తోంది.

"ఏవండీ! మనబాబు బ్రతికేవున్నాడు. మన శ్రీనుకు గండం తప్పిపోయింది!" సంతోషాతిశయంతో ఆమె కన్నులు వర్షిస్తున్నాయ్. కంఠం గద్గదమౌతోంది. రోమాంచ మౌతోంది. తడబడుతున్న చేతులతో బిడ్డను భర్తకు అందించింది.

శ్రీనివాసు భార్యనూ, బిడ్డనూ రెండు చేతులతో అక్కున చేర్చుకున్నాడు ఒకేసారి ఏదో మైకంలో వున్న వాడిలాగ.

అతని నోటి నుండి మాట పెగలడం అసాధ్యమైపోయింది.

* * * *




ఈ విచిత్ర సంఘటన గూర్చి పదిమందీ పది రకాలుగా వ్యాఖ్యానించారు.

సాక్షాత్తూ జగన్నాథుడే శ్రీలక్ష్మిలో ప్రవేశించి బాబును రక్షించాడు అన్నారు ఆస్తికులు.

ఇదేం సత్యయుగం కాదు దైవం దిగి రక్షించడానికి. ఇదేదో దయ్యం వ్యవహారమయి వుంటుంది. దయ్యం పట్టిన శ్రీలక్ష్మి ఆ అసాధ్యమయిన పని చేయగలిగింది అన్నారు మరికొందరు.

అదేం కాదు, కొడుకు చచ్చిపోతున్న విషయం తెలిసేసరికి ఆమెకు పిచ్చి ఎక్కింది. పిచ్చివాళ్ళకు ఒక్కొక్కసారి చాలా పిచ్చి బలం వస్తుంది. అలాంటి పిచ్చి బలంతోనే రథం ఆపగలిగింది అన్నారు నాస్తికులు.

అదో వింతగా పత్రికలు ఆ విషయాన్ని ప్రచురించాయ్.

ఊళ్ళో జనం అడిగే ప్రశ్నలకు, పత్రికా విలేకరులు అడిగే ప్రశ్నలకు, విమర్శలకు తట్టుకోలేకపోయింది శ్రీలక్ష్మి.

ఆమెకు కొడుకును రక్షించుకున్న సుఖంకన్న ఈ బాధ ఎక్కువైపోయింది. కట్టుకున్న భర్త కూడా తనతో మునుపటిలా వుండకపోవడంతో ఆమెకు మరీ దుఃఖం ఆగక పొంగి రాసాగింది. వందమంది అతికష్టంమీద గాని చెయ్యలేని పని నీవు ఒక్కత్తెవు ఎలా చెయ్యగలిగావని భర్త ప్రశ్నించినపుడు ఆమె సరియైన సమాధానం చెప్పలేకపోయింది.

ఏమో! నాకేం తెలియదు. బిడ్డను రక్షించుకుందా మని అంతమంది జనసమూహాన్ని త్రోసుకుని వెళ్ళలేక ఎగిరి పోదామనిపించింది. ఎగిరిపోయాను. రథం ముందుకు వెళ్ళినా శ్రీనును ప్రక్కకు తెచ్చే సమయం లేక శ్రీను మీద రథం పోకుండా ఆపాలనుకున్నాను. రెండు చేతులతో త్రాళ్ళు పట్టుకుని నాలోని బలం అంతా ఉపయోగించాను. రథం ఆగిపోయింది. అంత బరువైన రథాన్ని నేను ఆపగలనా అనే అనుమానం నాకు రాలేదు. అంతా జరిగిపోయిన తరువాత నేను చేసిన సాహసం నాకే ఆశ్చర్యంగా వుంది.

అదే ఆమె సమాధానం ఎవరు అడిగినా.

ఈ సంఘటన జరిగిన మూడో రోజు శ్రీలక్ష్మి అన్న ఉదయ్ అక్కడకు రావడం తటస్థించింది యాదృచ్ఛికంగా. అతను బెంగుళూరులో సైకో ఎనలిస్ట్ (మనో విశ్లేషణతో రోగ చికిత్స చేసేవాడు). అదే సబ్జక్టుపై రీసెర్చీ చేస్తున్నాడు కూడ.

అతను ఈ వింత సంఘటన వివరంగా తెలుసుకుని "ఇదేం దేవతాకృత్యం కాదు, పిచ్చి కూడా కాదు. సైకో ఎనలైసిస్, సైకాలజీ తెలిసిన వాళ్ళకు ఈ విషయం బాగా తెలుస్తుంది. శాస్త్రీయ దృక్పథంతో ఈ సంఘటన సాధ్యమేనని నిరూపించవచ్చు అన్నాడు.

బావ తృప్తిగా గాలి పీల్చుకుని "నీకు పుణ్యం వుంటుందిగాని ఆ నిరూపించేది ఈ ఊరి జనం మధ్య నిరూపించు బాబూ.వాళ్ళ వేధింపు పడలేక ఛస్తున్నాం" అని అభ్యర్థించాడు.

ఓ.కె. అన్నాడు ఉదయ్.

ఆ సాయంత్రమే దేవాలయ ప్రాంగణంలో ఊరి జనమంతా ప్రోగైనారు తీర్థంలాగ.ఉదయ్ మైక్ ముందు

నిలుచున్నాడు. దయ వుంచి నిశ్శబ్దంగా వుంటే మీ కందరకు నేచెప్పేది బాగా వినపడుతుంది.

సద్దు మణిగింది.

మీ కందరకూ ఉదయ్ అనే నేను నమస్కరిస్తున్నాను. శ్రీలక్ష్మి నా చెల్లెలు. నేను బెంగుళూరులో సైకో ఎనలిసిస్‌పై రీసెర్చి చేస్తున్నాను. మానసిక రోగ చికిత్సకుణ్ణి. రథోత్సవంనాడు శ్రీలక్ష్మి వింతచర్యకు శాస్త్రీయ దృక్పథంతో వివరణ ఇవ్వడానికి ఇక్కడ ఈ విధంగా ఉపన్యసించవలసి వచ్చింది.

ఆమె చర్య దేవతా చర్యగాని, దయ్యం చర్య గాని, పిచ్చిగాని కాదని మనవి చేస్తున్నాను. ఆమె చర్యలాంటిది మీలో ప్రతి ఒక్కరికి, నాకూ కూడా సాధ్యమే. కాకపోతే అవకాశం, అవసరం కలగాలి.

మనం అందరమూ మనుష్యులం. మనిషి అంటే ఈ కన్నూ, ముక్కూ, కాలూ, చేయి, రక్తం, మాంసం, ఎముకల ప్రోగు మాత్రమేనని అనుకోవద్దు. ఇదే శరీరంలో మనసు అనేది ఒకటుందని గ్రహించాలి. శరీరంలో కన్ను చూడటానికి, నోరు మాట్లాడేందుకు, చేతులు పని చేయడానికి, కాళ్ళు నడవడానికి ఇలా ఒక్కొక్క అవయవం ఒక్కొక్క పని మాత్రమే చేయడానికి సాధ్యమౌతుంది. కాని మనసు ఒక్కటే ఈ పనులన్నిటినీ చేయగలదు. వాటికంటే శక్తివంతంగా పని చేయకలదు. శారీరక శక్తి పరిమితం. మానసిక శక్తి అపరిమితం. అసలు మనిషి అంటేనే ఒక మహాశక్తి నిలయం. మనసులో ఇడ్, ఇగో, సూపర్ ఇగో అనే మూడు వ్యవస్థలు వున్నాయి. ఇందులో ఇడ్ నుండే మానసిక శక్తి (సైకిక్ పవర్) పుడుతుంది. ఈ మానసిక శక్తి లేకుండా మనిషి ఒక్క అడుగు కదలలేడు. జీవితంలో ఏ విషయంలో కూడా. మనమంతా అంతులేని ఆ మానసిక శక్తిలో కొంతభాగం మాత్రమే మన జీవితానికి అవసరమయినది ఉపయోగించుకుంటున్నాము. కాని ప్రపంచంలో కొందరు కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో హెచ్చు మానసిక శక్తి ఉపయోగించి సామాన్య మానవుడు చేయలేని పని చేస్తూంటారు. అందుకు ఉదాహరణ శ్రీలక్ష్మి చేసిన సాహసకృత్యం. మరో విషయం ఏమిటంటే ఇడ్ అనే మానసిక వ్యవస్థలో -మన వంశానుగతమైన లక్షణాలన్నీ అంతర్భూతమై వుంటాయి. మనిషి జంతువు నుండి పరిణామం చెందిన వాడే కాబట్టి గతంలో ఏఏ జంతువుల నుండి మనిషిగా ఈనాడు పరిణామం చెందడం జరిగిందో ఆయా జంతువుల లక్షణాలన్నీ సూక్ష్మాతిసూక్ష్మ రూపంలో ఇడ్‌లో నిక్షిప్తమై వుంటాయి.

రథోత్సవం నాడు తన బిడ్డ ప్రాణాపాయంలో వున్నాడని గ్రహించిన శ్రీలక్ష్మి తను జనం మధ్య నుండి త్రోసుకుని వెళ్ళలేక ఎగిరి వెళ్ళిపోతే బాగుండునని సంకల్పించుకుంది. ఆమె గతంలోని పక్షిజాతి అనుభవాలు, లక్షణాలు ఇడ్‌లో అంతర్భూతమైనవి హఠాత్తుగా అవసరానికి వచ్చాయి. పక్షిలా ఎగిరిపోగలిగింది. ఆమెకు బిడ్డే పంచ ప్రాణాలు. బిడ్డే సర్వస్వం. బిడ్డే జీవనం. బిడ్డే

## నాకు

నాకీ ప్రపంచం ఓ పరమాణువు
నాకీ ఏకాంతం
ఓ అంతు దొరకని మహా సముద్రం

## గుర్తు

భయంకరమైన జూన్ మధ్యాహ్నం
బతుక్కీ
ప్రశాంతమైన డిసెంబర్ రాత్రి
చావుకీ గుర్తు

—జింబో





ఆమె. ఆమే బిడ్డ. అలాంటి మహోన్నత అద్వైత భావనకు కారణం ఆమెకు ఇక సంతానం కలుగదని తెలియడం కూడా కొంత కారణం. ఈ ఏకైక బిడ్డను రక్షించుకోవాలనే తపనతో తను ఈ పని చేయగలవా అనే అనుమానం రాకుండా రెండు చేతులతో రెండు తాళ్ళూ పట్టుకుని బలమైన రథం ఆపాలనుకుని సంకల్పించుకుంది. ఆమె ఇడ్‌లోంచి అమితమైన మానసిక శక్తి (సైకిక్ పవర్) ఆమె చేతులచేత రథాన్ని నిలిపివేయగలిగింది.

ఇలాంటి సంఘటన ఆమెకే కాదు మనలో అందరికీ సాధ్యమే. మనలో బ్రహ్మాండమును పిండి చేయగల మానసిక శక్తి వుంది. ఆటంబాంబులను మించిన ఉపద్రవం సృష్టించగల మానసిక శక్తి మనలో వుంది. కాని మనకు అవసరం రాక ఉపయోగించుకోవడం లేదు.


సుమతి సూర్యగతిని ఆపివేసిందంటే మానసిక శక్తితోనే .

సీత మహా బలాఢ్యుడు రావణాసురుడు కదల్చలేని విల్లు కదల్చిందంటే మానసిక శక్తితోనే.

అక్బరు చక్రవర్తి రోగాన్ని తాన్ సేన్ తన మీదికి మరల్చుకోగలిగాడంటే మానసిక శక్తితోనే.

హెర్క్యులిస్ ఆకాశాన్ని ఎత్తగలిగాడంటే మానసిక శక్తితోనే.

ప్రపంచ చరిత్రలో- గాథల్లో ఇలా మానసిక శక్తిని




నిరూపించే ఘట్టాలున్నాయ్.

మొన్నమొన్న వార్తా పత్రికల్లో ప్రచురించిన సంఘటనలు కొన్ని మానసిక శక్తికి ఉదాహరణలు. చిన్న బాలుడు ఒకడు తనతోటి స్నేహితుడు నీటిలో కొట్టుకుపోతుంటే హఠాత్తుగా తను నీటిలో దూకి అతన్ని రక్షించగలిగాడు. తీరా విచారిస్తే అతనికి ఈత అస్సలు రాదు. మరి ఎలా రక్షించాడు. మానసిక శక్తితో. అతని ఇడ్‌లో గత జాతి పరిణామంలో చేపతాలూకు గుణాలు అంతర్భూతమై వున్నాయన్నమాట.

మరొక సంఘటన. ఒకామె దేవాలయానికి వెళ్ళి అక్కడ సంస్కృతం చదువుతున్న పూజారులతో కలిపి హఠాత్తుగా సంస్కృత శ్లోకం చదివేసింది ధారాళంగా. తరువాత తాను సంస్కృతం ఎన్నడూ చదవనిది ఎలా చదివానని ఆశ్చర్యపోయింది. అంటే ఆమె వంశానుగతమైన అనుభవం ఆమె ఇడ్‌లో వుంది. తీరా విచారిస్తే ఆమె ముత్తాత సంస్కృత పండితుడని తేలింది.

ఇలా చెప్పుకు పోతూంటే ఎంతో వుంది. సో- మీకు అందరకు నమస్కరిస్తూ మనవి చేసేదేమిటంటే శ్రీలక్ష్మి చర్యపై ఇక ఎలాంటి వ్యాఖ్యానాలు చేయవద్దు. మీలో ప్రతి ఒక్కరు శాస్త్రీయ దృక్పథం పెంపొందించుకోవడానికి ప్రయత్నించండి. మీకు తెలియకుండా మీలో దాగివున్న అనంతమైన మానసిక శక్తిని సద్వినియోగం చేసుకోండి. నమస్తే'' అంటూ చేతులు జోడించాడు.

జనం చప్పట్లు చరిచారు.

శ్రీలక్ష్మి, భర్తా ఒకరినొకరు చిరునవ్వుతో పలకరించుకున్నారు. ఆ ఇద్దర్నీ చూసిన ఉదయ్ తను ఓ మంచి పని చేయగలిగానని తృప్తిగా గాలి పీల్చుకున్నాడు.

●●●●●●●●●●●●●

పత్రికా ప్రపంచంలో
అపూర్వం - అద్భుతం
కధాకళి
సంచలన పక్ష పత్రిక
ఎక్కడా లేదు! ఎప్పుడూ లేదు!
ఇదే ప్రథమం!
కధాకళి ప్రతి సంచికలో
రెండు పూర్తి నవలలు
ప్లస్: కథలు, కార్టూన్లు, జోకులు
సినిమా స్పెషల్ వగైరా..
ప్రతి సంచికా ఒక ప్రత్యేక సంచికే!
కార్యాలయం: 1-8-703/6 నల్లకుంట, హైదరాబాద్.

వనితా జ్యోతి
సచిత్ర మాసపత్రిక
వనితాభ్యుదయానికి
అత్యున్నత రాజపథం
'వనితాజ్యోతి' నెలనెలా
పఠనం





వనితల
మనోభావాలను
ప్రతిబింబిస్తూ
మిమ్మలరిస్తున్న
ఉత్తమ శ్రేణి పత్రిక